నూతన సంవత్సర వేడుకల్లో "పోలీస్ నిఘా"

అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్సై సురేష్

విశాలాంధ్ర– జీకే వీధి: మండలంలోని నూతన సంవత్సర వేడుకల్లో యువత అప్రమత్తంగా ఉంటూ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలని గూడెం కొత్త వీధి పోలీసులు తెలిపారు. డిసెంబర్ 31న వేడుకలు జరుపుకునే యువకులు మద్యం సేవించి అతీ ఉత్సాహం ప్రదర్శించి ఇతరులకు ఇబ్బందులు పెట్టినట్టు ఫిర్యాదులు అందితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సంబరాల పేరిట జూదం ఆడిన,మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్ హెచ్చరించారు. మండలంలో నూతన సంవత్సర వేడుకలపై ప్రత్యేకంగా నిఘ పెట్టామని ఆయన తెలిపారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల పై సత్వర చర్యలు

కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు పై జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తో కలసి జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లాలో ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల ప్రస్తుత స్థితిగతులను, వాటిపై తీసుకున్న చర్యలను సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ అమిత్ బర్దర్ వివరించారు.పెండింగ్‌లో ఉన్న కేసులను వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రెవిన్యూ,పోలీస్ సోషల్ వెలేఫేర్, ట్రైబల్ వెలేఫేర్ ఇతర అధికారులతో కలిసి మండల స్థాయి కమిటీలు ఏర్పడి ప్రతి నెలా చివరలో సమావేశమై, గ్రామాలలో ఉన్న సమస్యల తీవ్రతను బట్టి , నమోదైన ఫిర్యాదులను, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను, భూ వివాద సమస్యలను సంబంధిత ఫిర్యాదుదారుతో చర్చించి చర్యలు పరిష్కరించాలని సూచించారు.క్షేత్రస్థాయి పర్యవేక్షణ అధికారులు గ్రామాలను సందర్శించి, ఎక్కడైనా వివక్ష లేదా అట్రాసిటీ కేసులు ఉంటే వాటిని గుర్తించి తక్షణమే పరిష్కార దిశగా అడుగులు వేయాలని నిర్ణయించారు.ఎస్సీ ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుండి అందవలసిన ప్రయోజనాలు ఆర్థిక సహాయం కేసు స్వభావాన్ని బట్టి బాధితులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని,న్యాయ సహాయం బాధితులకు ఉచిత న్యాయ సలహాలు మరియు కోర్టు ఖర్చులు అందజేయడం.పునరావాసం అవసరమైన సందర్భాల్లో బాధితులకు రక్షణ మరియు పునరావాస కల్పన కూడా అందుతుందని చెప్పారు. ఈ చట్టం కింద నమోదైన ఎఫ్.ఐ.ఆర్ నమోదైన వెంటనే చట్టపరమైన గడువులోగా విచారణ పూర్తి చేయాలిని, ఎస్సీ, ఎస్టీ హక్కులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, రెవెన్యూ మరియు పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి వివాదాలను పరిష్కరించాలని అన్నారు.

కిలో కాఫీ 600 రూపాయలు కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-అరకులోయ: ఈ సీజన్లో గిరిజనులు పండించిన కాఫీ పిక్కలకు జీసిసి ప్రకటించిన గిట్టుబాటు ధర సరిపోదని, కిలో కాఫీకి 600 రూపాయలకు కొనుగోలు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా కమిటీ నాయకులు పొద్దు బాలదేవ్,గెమ్మెలి చినబాబు, బుజ్జి బాబు డిమాండ్ చేశారు. అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్లో గొప్ప గిరాకీ ఉందని ఇక్కడ కాఫీ పిక్కలతో వ్యాపారులు కోట్లకు పడగలవుతున్నారని అరకు కాఫీ అంటే ప్రపంచమంతా అరకు వైపే చూస్తూ ఈ కాఫీ పిక్కలను ఊహించని లేని ధరలకు కొనుగోలు చేస్తుందని వారన్నారు. ఇంతగా గుర్తింపు పొందిన కాఫీ పంటకు రైతులు పడుతున్న కష్టం ఎవరికి తెలియదని వారు వాపోయారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్జాతీయంగా అరకు కాఫీకు గుర్తింపు లభించిందని ప్రకటనలు గుర్తిస్తున్నప్పటికీ గిరిజన కాఫీ రైతులను ఆదుకోవడంలో విఫలం అవుతుందని వారు విచార వ్యక్తం చేశారు. కాఫీ కిలో రకాన్ని బట్టి పార్చుమెంట్ కు 600 రూపాయలు,చెర్రీ కాఫీకు 300 రూపాయలు, పండుతో ఉన్న కాఫీ కు 150 రూపాయలు కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల కాఫీ పంటలకు సోకిన బెర్రీ బోర్రర్ వ్యాధితో నష్టపోయిన గిరిజన కాఫీ రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని అల్లూరి జిల్లా ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు.జీసిసి ప్రకటించిన గిట్టుబాటు ధరతో కాఫీ రైతులకు ఎటువంటి మేలు జరగదని వారి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కదని వారు వాపోయారు. కాఫీ పై జీసిసి ప్రకటనలు చేస్తుందే తప్ప ఎక్కడ కొనుగోలు చేసిన దాఖలాలు లేనే లేవని దళారులదే రాజ్యమేలుతుందని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి జీసిసి ప్రకటనలతో సరిపెట్టకుండా వాస్తవాలపై ద ృష్టి సారించి కాఫీ రైతులకు మేలు చేసే విధంగా వారిని ఆదుకునేందుకు మేలుగా కాఫీ కొనుగోలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ2

విశాలాంధ్ర- దుంబ్రిగుడ :మండలంలోని సొవ్వ ప్రాథమిక పాఠశాలను రెండవ మండల విద్యాశాఖ అధికారి జి గెన్ను సోమవారం సందర్శించి తనిఖీ చేశారు . ఈ సందర్భంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధన తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సకాలంలో విధి నిర్వహణ చేపట్టి విద్యార్థులకు విద్యాబోధన చేయాలని ఆయన సూచించారు .ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పులపాలెంలో న్యాయ విజ్ఞాన సదస్సు

'ప్రొటెక్ట్ టుడే ,సెక్యూర్ టుమారో'పై అవగాహన

విశాలాంధ్ర -అడ్డతీగల: అడ్డతీగల మండలం దుప్పులపాలెం గ్రామంలో సోమవారం నాడు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దుప్పులపాలెం గ్రామంలోని ఎం.పి.పి. స్కూల్ మరియు అంగన్వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు అడ్డతీగల మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పరిధిలో పనిచేస్తున్న డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ పారా లీగల్ వాలంటీర్ తీగల బాబురావు తెలిపారు. ఈసందర్భంగా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రారంభించిన "ఈ రోజు రక్షించండి రేపటిని భద్రపరచండి (ప్రొటెక్ట్ టుడే సెక్యూర్ టుమారో)" అనే శీర్షికతో పాన్ ఇండియా పర్యావరణ న్యాయ అక్షరాస్యత సమాజ పరిరక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతలపై విద్యార్థులకు వివరించడంతో పాటు, విద్య హక్కు చట్టం పై కూడా విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో న్యాయ విజ్ఞానం పెంపొందించడమే లక్ష్యమని అన్నారు

గురుకులం పాఠశాలలో వనమహోత్సవం సందడి

విశాలాంధ్ర -జి.మాడుగుల: మండల కేంద్రంలోగల గురుకులం పాఠశాలలోసోమవారంగురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ వేణు ప్రసాద్ ఆధ్వర్యంలో వనభోజన(గార్డెన్ పార్టీ)కార్యక్రమం సందడిగా జరిగింది. విద్యార్థులు పలు సాంస్కృత కార్యక్రమాలు ప్రదర్శనలు అందరినీ అలరించాయి. విద్యార్థులలో సమైక్యత స్నేహభావం మరింత పెంపొందించడానికి ఇటువంటి గార్డెన్ పార్టీలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ పారయ్య, మినీ గురుకులం పాఠశాల హెచ్ఎం విజయ కుమారి అధ్యాపకులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

విశిష్ట సేవలకు ఎస్సై సిఐ కి ప్రశంస పత్రాలు

విశాలాంధ్ర -ఎటపాక: ఎటపాక పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై, సిఐ ప్రశంస పత్రాలు అందుకున్నారు.సోమవారం పాడేరు అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం ఎస్పీ కార్యాలయంలో

ఉత్తమ సేవలు ప్రతిభను కనబర్చిన ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ కన్నప్పరాజు, సబ్ ఇన్స్పెక్టర్ అప్పల రాజుకు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఏ ఎస్పీ హేమంత్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. ప్రసాంశ పత్రాలు అందుకున్న ఎస్సై, సిఐ లను పలువురు అభినందించారు.

కన్నుల పండుగగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం

విశాలాంధ్ర-వి. ఆర్. పురం:అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రెండో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరికి గ్రామంలో వెలిసిన శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయము నుండి ఉత్సవ విగ్రహాలను తోడుకొని గ్రామ పురవీధులలో ఊరేగింపుగా తీసుకొని వచ్చి గోదావరి నది తీరాన ఏర్పాటుచేసిన హంస వాహనం పై సీతారామచంద్ర స్వాముల వారిని ఆ సీనులను చేసి వేద పండితులు మంత్రోచరణల నడుమ గోదావరి నదిపై మూడుసార్లు స్వామివారిని తే ప్పోత్సవం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు కనులారా వీక్షించి మొక్కులు చెల్లించుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి తన్న యత్వం చెందారు. స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లను చేశారు. అనంతరంశ్రీ స్వామివారిని శ్రీరామగిరి గుట్టపై ఉన్న ఆలయంలోకి తోడుకొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో శ్రీరామగిరి దేవస్థానం ఆలయ చైర్మన్ పెందుర్తి సుధాకర్, ఆలయ కమిటీ, గ్రామస్తులు పెద్దలు ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య,నవోదయ నమూనా పరీక్షకు విశేష స్పందన

విశాలాంధ్ర-మాడుగుల: దిరేస్ అకాడమీ, నర్సీపట్నం ఆధ్వర్యంలో సోమవారం జి. మాడుగుల మండలంలోని గాంధీనగరం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఏకలవ్య,నవోదయ నమూనా ప్రవేశ పరీక్ష మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి 45 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. ఈ సందర్భంగా గాంధీనగరం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మత్స్యరాస మత్స్యరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన జగదీష్, గణేష్, దర్శిత, గౌస్మితా శ్రీ, భవిష్య, ప్రవీణ్, మహేంద్ర విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఈ సందతరేగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి నమూనా పరీక్షలు విద్యార్థులకు పోటీ పరీక్షలపై ముందస్తు అవగాహన కల్పిస్తాయని, ప్రభుత్వం నిర్వహించే ఏకలవ్య, నవోదయ వంటి ప్రవేశ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎస్. రామచంద్ర రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారులు

విశాలాంధ్ర- జీకే వీధి :గూడెం కొత్త వీధి మండలం జి కె ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలో నిర్వహించిన 'బాల్య వివాహ ముక్త భారత్' అవగాహన కార్యక్రమంలో బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం, వివాహాలు చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోవడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారులు కమిటీ రాజశేఖర్, శాంతి, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ వలసమ్మ అన్నారు. బాల్య వివాహాలతో పాటు, ఫోక్సో చట్టం మరియు పాఠశాల స్థాయి రక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. పిల్లలకు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు లేదా బాల్య వివాహాల సమాచారం తెలిసినప్పుడు ఫిర్యాదు చేయడానికి 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) నంబర్‌ను సంప్రదించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఆశ్రమ విద్యార్థుల మరణాలు

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణుమూర్తి

విశాలాంధ్ర -సీలేరు:అధికారుల నిర్లక్ష్యంతోనే ఆశ్రమ పాఠశాలల్లో మరణాలు సంభవిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి విష్ణుమూర్తి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం సీపీఐ మండల కార్యదర్శి కవర్ల భగవాన్‌తో కలిసి మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య సహాయకులు లేకపోవడంతో తరచూ ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని, ముఖ్యంగా ఆసుపత్రిలలో పూర్తి స్థాయిలో సిబ్బంది లేరని, వైద్యులు, సిబ్బంది కొరతతో సీలేరు, దారకొండ, నప్పర్ల పీహెచ్‌సిలలో వైద్య సేవలు అరకొరగా అందుతున్నాయని ఆయన ఆరోపించారు. పోని ఏదైన అత్యవసర వైద్యం కోసం పరిగెడదామంటే సీలేరు నుంచి చింతపల్లి వరకు రహదారి అధ్వాన స్థితిలో ఉండటంతో సుమారు నాలుగు గంటల సమయం పడుతుందని, ఒక్కోసారి మార్గమధ్యలో చనిపోయిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. దశాబ్దాలుగా ఈ సమస్యలు వేధిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు దృష్టిసారించాలని ఆయన డిమాండ్ చేశారు.

ముసిని గుంట,చాపరాల పల్లి మధ్య తారు రోడ్డు వెయ్యరూ

విశాలాంధ్ర -దేవీపట్నం :మండలంలోని ఇందుకూరు పంచాయతీ ముసినిగుంట -చాపరాల పల్లి గ్రామాల మధ్య తారు రోడ్డు వెయ్యాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు వేస్తే దేవీపట్నం మండలం నుంచి రంపచోడవరం వెళ్లే అనేక మందికి దూరం తగ్గి ప్రయాణం సులభతరం అవుతుంది. మధ్య ఉన్న అనేక గ్రామాలకు ప్రయోజకరం గా ఉంటుంది. గతంలో ఈ చాపరాల పల్లి ,ముసినిగుంట మధ్య బి టి రోడ్డు వేశారు. ప్రస్తుతం మెటల్ పరిచి రోలర్ తో తొక్కించక మెటల్ తేలిపోయి రాళ్లతో దుర్భేద్యం గా ఉంది. రాకపోకలు కు వీలు లేకుండా ఉంది. ఈ గ్రామాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలకు రంపచోడవరం తో పని ఉన్న అనేక మంది కి సులభవం గా ఉంటుంది. అధికారులకు అందివుచ్చుకున్నట్లు ఉంటుంది.

నూతన సంవత్సర, సంక్రాంతి సంబరాలపై పోలీసుల ప్రత్యేక నిఘా

సిఐ వినోద్ బాబు

విశాలాంధ్ర - చింతపల్లి :రానున్న నూతన సంవత్సర, సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయడంతో పాటు, భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వినోద్ బాబు అన్నారు. సంబరాలను పురస్కరించుకొని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబరాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా 'ఆంధ్రా ఊటీ'గా పేరుగాంచిన లంబసింగి ప్రాంతం నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సమయంలో పర్యాటకులతో కిటకిటలాడే అవకాశం ఉన్నందున ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా లంబసింగికి పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.లంబసింగి, పరిసర గ్రామాలు, వ్యూ పాయింట్లు, రిసార్ట్స్, ప్రధాన రహదారుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆరు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు 24 గంటలపాటు గస్తీ నిర్వహిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తాయని చెప్పారు. రిసార్ట్స్‌లో రేవ్ పార్టీలు, మత్తుపదార్థాల వినియోగం, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే కార్యక్రమాలను పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. ఇదే క్రమంలో కోడి పందాలు, పేకాటలు వంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగల సమయంలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు, పర్యాటకులు పోలీస్ శాఖకు సహకరించి సంబరాలను సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ వినోద్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు ఎం వెంకటరమణ, వీరబాబు లు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థుల మరణాలు ఎవరికీ పట్టావా...?

నందిని కుటుంబానికి 25 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ

విశాలాంధ్ర -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసి ప్రాంతంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థిని విద్యార్థులు మృత్యువాత పడుతున్న అధికారులు, ప్రభుత్వం పట్టి పట్టినట్లుగా వ్యవహరించడం చాలా దుర్మార్గమనిఆంధ్రప్రదేశ్ గిరిన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఆదివాసి ప్రాంతంలో ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థుల మరణాలు ఎవరికి పట్టవా..? ఆశ్రమ పాఠశాలలలో ఏదో ఒకచోట అమాయక ఆదివాసి విద్యార్థిని విద్యార్థులు మరణిస్తున్న అధికారులు, ప్రభుత్వం పట్టి పట్టినట్లు వ్యవహరించడం చాలా దుర్మార్గం మన్నారు.ఆశ్రమ పాఠశాలలో అధికారులు పర్యటించకపోవడం గత ఐదు సంవత్సరాల నుండి నేటి వరకు విద్యార్థులు అనేకమందివిద్యార్థిని విద్యార్థులు మృత్యువాత పడుతున్న ఎందుకు మృత్యువాత పడుతున్నారనే దానిపై కనీసం తెలుసుకోకపోవడం, ఆశ్రమ పాఠశాలలో హెల్త్ అసిస్టెంట్లు కూడా నియమించకపోవడం చాలా దారుణమన్నారు.అనేక ఆశ్రమ పాఠశాలలలో ఫుడ్ పాయిజన్లు, రక్తహీనత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సరైన మెడికల్ క్యాంపులు నిర్వహించకపోవడం, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించకపోవడం గిరిజన విద్యార్థుల పట్ల అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో దీన్నిబట్టి ఆదివాసులకు అర్థమవుతుందన్నారు.గత ఐదు సంవత్సరాల కాలం నుండి నేటి వరకు ఆశ్రమ పాఠశాలలలో హెల్త్ అసిస్టెంట్లు నియమించి విద్యార్థుల మరణాలు అరికట్టాలని అనేక రూపాల్లో ఉద్యమాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అని అన్నారు.తక్షణమే ఆశ్రమాలలో హెల్త్ అసిస్టెంట్లను నియమించి విద్యార్థుల మరణాలు అరికట్టాలని ప్రభుత్వన్నీ డిమాండ్ చేశారు.అదేవిధంగా జీకే వీధి మండలం సీలేరు ఆశ్రమ పాఠశాలలలో ఆరో తరగతి చదువుతున్న పాంగి నందిని అనారోగ్యంతో మ ృతి చెందిన విషయం తెలిసినదే, ఆ కుటుంబానికి 25 లక్షల ఎక్స్గ్రేషియా ప్రభుత్వం చెల్లించాలని ప్రభుత్వానికి కోరారు.ఆశ్రమ పాఠశాల సమస్యలు పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు.

ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం

అల్లూరి జిల్లాలో మావోయిస్టు కార్యకర్తలు కీలక మలుపు తిరిగాయి

అన్ని శాఖల సహకారంతో గంజాయి నిర్మూలన

ఎస్పి అమిత్ బర్దార్

విశాలాంధ్ర -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ శాఖ ప్రజల సహకారంతో శాంతిభద్రతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ నేరాల నియంత్రణ గంజాయి నిర్మూలన మావోయిస్టు కార్యకలాపాల అణచివేతలో విశేష ఫలితాలు సాధించిందని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ అన్నారు. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ అధికారులతో వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ముందస్తు ఇంటలిజెన్స్ సమాచారం నివారణ చర్యలు తక్షణ స్పందన వ్యూహాత్మక ప్రాంతాల్లో బలగాల మోహరింపు సమర్థవంతమైన బీట్ వ్యవస్థ ప్రత్యేక డ్రైవులు విజిబుల్ పోలింగ్ ఆధునిక సంకేతిక వినియోగం, ఇతర శాఖల తో సమన్వయం వల్ల అల్లూరి సీతారామరాజు జిల్లాలో శాంతిభద్రతాలు పూర్తిగా నియంత్రణలో ఉన్నాయని ఆయన అన్నారు. 2023,2024 కంటే 2025లో నేరాలను పోలిస్తే 34 శాతానికి తగ్గాయి అన్నారు. హత్యలు దోపిడీలు దొంగతనాలు మహిళలపై నేరాలు రోడ్డు ప్రమాదాలు ఎన్ డి పి ఎస్ ఐ పి సి తదితర అన్ని విభాగాల్లో గణాంకాలు నమోదు చేయబడ్డాయి అన్నారు. 2025 లో నమోదైన కేసులు 135 స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ 14,484.38 కిలోలు అని అన్నారు. హషీష్ ఆయిల్ 35.61 కిలోలని,అరెస్టు చేసిన నిందితులు 358మంది అన్నారు. జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని అందులోవిద్యాసంస్థలు 253గాక గ్రామాలు 1596,మొత్తం పాల్గొన్న ప్రజలు 1.27 లక్షలు మంది పాల్గొన్నారన్నారు.గంజాయి సాగు నిర్మూలన చేయడం జరిగిందన్నారు.డ్రోన్లు అలాగే మానవ గూఢచారి సహాయంతో 138 గ్రామాల పరిశీలన చేయగా గంజాయి సాగు ఎక్కడా గుర్తించబడలేదన్నారు.325 కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పన ప్రత్యామ్నాయ పంటలు మొత్తం 29,841 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు ఇవ్వటం జరిగిందన్నారు. 30,005.65 కిలోల గంజాయి అలాగే 35.26 కిలోల హషీష్ ఆయిల్ దహనం చేయటం జరిగిందన్నారు. 74.41 కోట్ల విలువైన ఆస్తులు స్వాధీనం చేసుకొని 41 పి ఐటీ అలాగే ఎన్ డి పి ఎస్ 11 కేసుల్లో శిక్షలుఖరారు.అల్లూరి సీతారామ రాజు జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలు కీలక మలుపు తిరిగాయన్నారు. 2024,2025లో చేపట్టిన భద్రతా చర్యల వల్ల ఏఓబి ఎస్ జెడ్ సి నాయకత్వం పూర్తిగా దెబ్బతిందన్నారు.జిల్లాలో మొత్తం మావోయిస్టుల కేసులు16 ఎదురుకాల్పుల్లో మ ృతులు18 మంది అరెస్టులు 9 మంది లొంగిపోయిన మావోయిస్టులు 49 మంది అని అన్నారు.మహిళలపై నేరాల్లో తగ్గుదల నమోదు అయింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్ ద్వారా మహిళలు తక్షణ సహాయం పొందుతున్నారు.సైబర్ నేరాలపై విస్త ృత అవగాహన కార్యక్రమాల వల్ల మోసాల సంఖ్య జిల్లాలో తగ్గిందన్నారు.గత ఏడాదితో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు 14శాతం తగ్గాయన్నారు.2025లో శిక్షలు ఖరారైన కేసులు జీవిత ఖైదు 5 కేసులు,20 సంవత్సరాల శిక్ష 1 కేసు,10 సంవత్సరాల శిక్ష 2 కేసులు, 5నుండి 7 సంవత్సరాల శిక్ష 1 కేసు బాల నేరస్తులు 5 కేసులులోక్ అదల్ మొత్తం 843 కేసులుపరిష్కరించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడి కలగకుండా అనుకున్న లక్ష్యాలను సాధించాలి

స్ట్రెస్ అండ్ మైండ్ ఫుల్ నెస్ కార్యక్రమంలో విద్యార్థులకు వివరించిన వక్తలు బాలకృష్ణ, ఢిల్లేశ్వరరావు

విశాలాంధ్ర - చింతపల్లి :- మానసిక ఒత్తిడి కలగకుండా ఆహ్లాదంగా అనుకున్న లక్ష్యాలను ఎలా సాధించాలో అవగాహన పెంచుకోవాలని స్ట్రెస్ అండ్ మైండ్ ఫుల్ నెస్ అంశంపై ప్రసంగించిన ప్రధాన వక్తలు బాలకృష్ణఢిల్లేశ్వర రావులు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి, పాడేరు డిగ్రీ కళాశాల పి ఎం ఉష ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రెస్ అండ్ మైండ్ ఫుల్ నెస్ అనే అంశంపై ఒకరోజు వర్క్ షాపు ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలు బాలకృష్ణ ఢిల్లేశ్వరరావులు విద్యార్థిని, విద్యార్థులనుద్దేశించి మానసిక ఒత్తిడి కలగకుండా ఆహ్లాదంగా అనుకున్న లక్ష్యాలను ఎలా సాధించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినుముల శ్రీనివాస పాత్రుడు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా రవీంద్ర నాయక్, కన్వీనర్ గా శ్రీనివాసరాజు , ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తుల సామర్థ్యాన్ని, పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సాహించాలి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : పరిశ్రమల ఏర్పాటులో అధికారులు ప్రత్యేక చొరవ చూపించి పరిశ్రమల యాజమాన్యాలకు సహాయ సహాయకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ సూచించారు . సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరం నుండి వీడియో కానారేన్స్ ద్వారా వర్చువల్ గా మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు ,సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పటు చేయుటకు జిల్లాకు 250 ఎకరాలు ప్రభుత్వం భూ కేటాయింపు చేయడం జరిగిందని , ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నరు. పర్యాటక ప్రాంతాలైన అరకు , పాడేరు , మారేడుమిల్లి ప్రాంతాలలో కార్ వ్యాన్ లు , రిసార్ట్స్ , కాటేజీలు , సాహసోపేతమైన ఆటల పార్క్ ల నిర్మాణాలకు భూ సేకరణ చేపట్టి , గ్రామ సభల తీర్మానాల ద్వారా గ్రామ పంచాయతీల నుండి ఆమోదం తీసుకొని సంబందిత యాజమాన్యాలకు అప్పగించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు వేగముగా మంజూరు చేయాలనీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి ,రంపచోడవరం ఐటిడిఏ పిఓ స్మరన్ రాజ్ , చింతూరు ఇంచార్జ్ పిఓ శుభం నోఖ్వాల్ , లతో పాటు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సీలేరు ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఏటీడబ్ల్యూఓ

విశాలాంధ్ర - సీలేరు:జీకేవీధి మండలం సీలేరు ఆశ్రమ పాఠశాల విద్యార్థిని నందిని(11) మృతి వల్ల సోమవారం జీకేవీధి ఇన్‌ఛార్జ్ ఏటిడబ్ల్యూఓ పి.వినాయకరావు ఆశ్రమ పాఠశాలలో తోటి విద్యార్థులను, సిబ్బందిని విచారణ నిర్వహించారు. నందిని శుక్రవారం వరకు బాగానే ఉందని, శనివారం జ్వరం వచ్చినట్లు ఉందని వార్డెన్‌కు తెలియజేయడంతో ఆమె వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలను చేయించి తీసుకొచ్చినట్లు తోటి విద్యార్థినులు తెలిపారు. ఆదివారం ఉదయం కూడా నందిని టిఫెన్ చేయనని చెప్పడంతో వార్డెన్ మేడమ్ నందినికి దగ్గరుండి టిఫెన్ తినిపించారని, ఆసుపత్రికి వెళదామని నందినితో చెప్పిన కొద్ది సేపటికే ఒక్కసారిగా కళ్లు తిరిగి పడిపోవడంతో వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేశారని, అంబులెన్స్ కూడా వెంటనే రాలేదని విద్యార్థినులు ఏటిడబ్ల్యూకు వివరించారు. అనంతరం తాము ఆసుపత్రికి వెళ్లి చూడగా నందిని చనిపోయినట్లు అనంతరం ఏటిడబ్ల్యూఓ సీలేరు పీహెచ్‌సికి వెళ్లి వైద్యాదికారి నారాయణరావును, వైద్య సిబ్బందిని మృతికి గల కారణాలను ఏటిడబ్ల్యూఓ విచారణ చేశారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూఓ వినాయకరావు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తోటి విద్యార్థులనులు, వైద్యాదికారి, సిబ్బంది విచారణతో తెలిపిన నివేదికను జిల్లా ఉన్నతాధికారులు కలెక్టర్, ఐటీడీఏ పికు అందజేస్తామని తెలిపారు.

కార్మికులు, కార్పొరేట్ శక్తుల మధ్య నైతిక విజయం కార్మికులదే

సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

విశాలాంధ్ర - చింతపల్లి :కార్మికులు, కార్పొరేట్ శక్తుల మధ్య జరిగే పోరాటంలో కార్మికులదే నైతిక విజయమని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలో సిఐటియు అఖిలభారత మహాసభలు జయప్రదం కై సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు, ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలకు విశాఖ వేదిక కానుందని, దేశ నలుమూలల నుంచి కాకలు తిరిన కార్మిక పోరాట నాయకులు అన్ని రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ 2 వేల మంది హాజరుకానున్నారని, వీరితోపాటు ఇతర 6 దేశాల నుంచి ప్రతినిధులు రానున్నారన్నారు. ఇప్పటికే రోజు ఐదు గంటల నుంచి 9 గంటల వరకు వివిధ రూపాల్లో శ్రామిక ఉత్సవ పేరుతో సాంస్క ృతిక కళారూపాలు, ప్రదర్శనలు జరుగుతున్నాయని, ప్రముఖ సినీ నటులు, రచయితలు, కళాకారులు హాజరై ప్రారంబోత్సవాలు చేస్తున్నారని, ప్రకాష్ రాజ్, గోరేటి వెంకన్న, శుద్దల అశోక్ తేజ్, సింగర్ మంగ్లీ ఈ సాంస్కృతిక ఉత్సవాలలో పాల్గొనటానికి విశాఖ వస్తున్నారని ఈ సందర్భంగా వచ్చిన వారందరూ మాట్లాడుతూ తాత్కాలికంగా ఓటమి అయినప్పటికీ దీరెకాలంలో కార్మికులదే పై చేయి అవుతుందని కార్మిక రాజ్యంలోనే ఈ దేశం అభివృద్ధి చెందుతుందని, దోపిడీ లేని సమాజం ఏర్పడుతుందని వివరించారన్నారు, కూలి, యజమాని, కార్మికుడు, కంపెనీ యజమాని తేడా లేకుండా అంత సమానత్వం కోసం కార్మిక వర్గం ముందు బాగాన నిలబడి ఆ రాజ్యం కోసం పోరాటం చేయవలసి వస్తుందని కొనియాడారు. నాలుగున విశాఖ నగరంలో జరిగే లక్షలాదిమంది బహిరంగ సభలో కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మోరి వెంకటగిరి, పాంగి ధనుంజయ్, వంతల నాగేశ్వరరావు. సాగిన చిరంజీవి పడాల్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందగిరిపై వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర -రంపచోడవరం : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం ఐ. పోలవరం. గోవింద గిరి పై తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్య క్షేత్రం లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారి రూపుసాయి, డిల్లీ ప్రసాద్ అర్చకస్వాములు శ్రీ పార్థస్వామి, శ్రీ శ్రీమణికంఠస్వామి తెలియ చేశారు. మంగళవారం ఉదయం 3: 30 నుండి 5: 00 గంటలవరకు స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉదయం 5:00 గంటలనుండి సాయంత్రం 5: 00గంటలవరకు భక్తులకు స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం ఇస్తారు. అనంతరం మిగిలిన పూజా కైంకర్యములు యధావిధిగా జరుగుతాయి. మంగళవారం మధ్యాహ్నం శ్రీవారి సేవకులచే అన్నప్రసాద వితరణ జరుగుతుంది. మరుసటి రోజు బుధవారం ఉదయం 9: 00గంటలనుండి స్వామివారి తిరుమాడవీది సేవ ఉంటుంది పల్లకి సేవలో పాల్గొనే పురుషులు విధిగా తెలుపు రంగు వంచె, భుజాన కండువా ధరించాలని కోరారు. కో ఆర్డినేటర్ నల్లమిల్లి రామారెడ్డి తెలిపారు.

ఎమ్ పి హెచ్ డబ్ల్యు (ఎఫ్) ను ఆకస్మిక తనిఖీ చేసిన కృష్ణమూర్తి నాయక్

విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలి

అల్లూరి జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్

విశాలాంధ్ర -పాడేరు: విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కృష మూర్తి నాయక్ అన్నారు. సోమవారం పాడేరు ప్రభుత్వ గిరిజన బహుళార్థ సాధక స్త్రీ శిక్షణ కేంద్రం ఎమ్ పి హెచ్ డబ్ల్యు (ఎఫ్) ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో అందుబాటులో ఉన్న విద్యార్థినుల వివరాలు వారికి అందిస్తున్న పౌష్టికాహారం గూర్చి, అందుబాటులో ఉన్న వసతుల గూర్చి అడిగితెలుసుకోవడం జరిగిందని అన్నారు.విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓ శాంతి కుమారి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే ప్రయాణం సురక్షితం

ప్రయాణం కంటే ప్రాణాలే ముఖ్యం

ప్రమాదానికి గురి కావద్దు...ప్రాణాలు కోల్పోవద్దు

చింతూరు డివిజన్ లో ఆర్టీఓ పర్యటన

వాహన దారులకు సూచనలు, సలహాలు

విశాలాంధ్ర -ఎటపాక:వాహన దారులు నిబంధనలు పాటిస్తేనే ప్రయాణం సురక్షితమని, ప్రయాణం కంటే ప్రాణాలే ముఖ్యమని చింతూరు మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ బండారు చలపతిరావు అన్నారు. విలీన మండలాల పర్యటనలో భాగంగా ఎటపాక మండలం తోటపల్లి, నెల్లిపాక ప్రధాన, జాతీయ రహదారిపై వాహన దారులకు సోమవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వాహన తనిఖీలు చేపట్టారు. అన్ని వాహనాలకి టాక్స్ లు, ఫిట్నెస్ , ఇన్సూరెన్సులు, లైసెన్సు లతో పాటు అన్నీ వ్యాలిడిటీలు ఉండాలనీ, రోడ్ యాక్సిడెంట్లు అవ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్ సేఫ్టీ సూచనలు పాటించాలని చూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు సహకరించాలని, పరిమితికి మించి లోడ్, ప్రయాణికులను తరలించడం ప్రాణానికే ప్రమాదమని గుర్తుచేశారు.

శ్రీనివాస్ యాదవ్ నీ సన్మానించినా టీడీపి నాయకులు

విశాలాంధ్ర -ఎటపాక: రంపచోడవరం నియోజక వర్గం అబ్జర్వర్ కోల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ నీ వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు నూతన డైరెక్టర్ గాస్వామి వారి ఆశీసులతో ప్రమాణ స్వీకారం చేస్తున్న శుభ సందర్భంగా ఎటపాక టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య , వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వర రావు, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, అరకు పార్లమెంట్ కార్యదర్శి మువ్వా శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాయి మాధవరావు, మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన రానున్న కాలంలో ఇంకా మరెన్నో ఉన్నత స్థాయి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు అధిరోహించాలని మనస్పూర్తిగా భగవంతున్ని ప్రార్థిస్తు కోరినారు .

కూటమి పార్టీ అభ్యర్థుల విజయానికి అభ్యర్థుల సమిష్టి కృషి అవసరం

రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో సమిష్టిగా పనిచేయండి

టిడిపి, జనసేన, బిజెపి మండల అధ్యక్షులు

పూర్ణచంద్రరావు, బుజ్జిబాబు, బాలకృష్ణ

విశాలాంధ్ర - చింతపల్లి :రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంలో కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయవలసిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి, జనసేన, బిజెపి మండల అధ్యక్షులు కిల్లో పూర్ణచంద్రరావు, వంతల బుజ్జిబాబు, సాగిన బాలకృష్ణలు అన్నారు. ఆ మూడు (కూటమి) పార్టీలకు చెందిన మండల నాయకులు, కార్యకర్తల అత్యవసర సమావేశం సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల శ్రేణులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి పంచాయతీలో కూటమి పార్టీలకు చెందిన అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించాలన్నారు. తద్వారా అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ మూడు పార్టీలకు చెందిన నాయకులు, ఏఎంసీ డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా సి.హెచ్. లక్ష్మీనరసయ్యమ్మ

విశాలాంధ్ర - అడ్డతీగల:అడ్డతీగల మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా సి. హెచ్. లక్ష్మీనరసయ్యమ్మకు సోమవారం పూర్తి బాధ్యతలు అప్పగించారు.గత కొద్ది రోజుల క్రితం ప్రిన్సిపల్ సెక్రటరీ అడ్డతీగల బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా పాఠశాలలో పీఈటి, డిప్యూటీ వార్డెన్, ప్రధానోపాధ్యాయురాలు బాధ్యతలను జి. నాగమణి ఒక్కరే నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఒకే వ్యక్తి ఇన్ని బాధ్యతలు నిర్వర్తించడం కష్టతరమని భావించిన ప్రిన్సిపల్ సెక్రటరీ, పూర్తి స్థాయి ప్రధానోపాధ్యాయురాలిని నియమించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ నేపథ్యంలో పాఠశాలలో సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయురాలు సి. హెచ్. లక్ష్మీనరసయ్యమ్మకు ప్రధానోపాధ్యాయురాలిగా పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఆమెతో కలిసి పనిచేసిన ఉపాధ్యాయ బృందం, లక్ష్మీనరసయ్యమ్మను ప్రధానోపాధ్యాయురాలిగా సాదరంగా ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.పాఠశాల అభివృద్ధి, విద్యార్థినుల విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం సమిష్టిగా క ృషి చేస్తామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు

కొత్తసంవత్సర వేడుకల్లో హద్దులు దాటితే కఠిన చర్యలు తప్పవు

సీఐ హిమగిరి హెచ్చరిక

విశాలాంధ్ర-అరకులోయ: ఈనెల 31వ తేదీ బుధవారం జరిగే కొత్త సంవత్సర వేడుకలను పర్యాటకులు, స్థానికులు అత్యంత ఆనందంగా జరుపుకోవాలని అరకులోయ సర్కిల్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఎల్. హిమగిరి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. అరకులోయ సర్కిల్ పరిధిలోని అనంతగిరి,డుంబ్రిగూడ, అరకులోయ మండలాల పరిధిలో కొత్త సంవత్సర వేడుకలు అత్యంత అదుతేంగా, ఆనందంగా జరిగే అవకాశం ఉందన్నారు. అయితే ఈ వేడుకలను ప్రశాంతంగా పోలీస్ నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.ప్రధానంగా ఈ మూడు మండలాల్లో నిర్వహణలో ఉన్న లాడ్జీలు, రిసార్ట్స్ లు,టెంట్లు, హోటల్స్ యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. కొత్త సంవత్సర వేడుకలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జరుపుకోవాలని హద్దులు దాటితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. లాడ్జిలు,రిసార్ట్స్ లు,టెంట్లు, గెస్ట్ హౌస్, హోటల్స్ నిర్వాహకులు తమ ప్రాంగణంలో ఎటువంటి డీజేలు, ఫైర్ క్యాంపులు లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే బహిరంగంగా మద్యం సేవించిన, మద్యంతో పట్టుబడిన చర్యలు తీసుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఎవరైనా ఎంతటి వారైనా పోలీస్ శాఖ నిబంధనలను పాటించాల్సిందేనని నిబంధనలను ధిక్కరించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే పోలీస్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టపరిచారు. అంతేకాకుండా మద్యం సేవించి రహదారులపైన రేస్ డ్రైవింగ్ చేస్తే అటువంటి వారి లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి జరిమానాలు విధించడం కూడా జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఎటువంటి అల్లర్లు, అగచాట్లు అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా అత్యంత ప్రశాంతంగా కొత్త సంవత్సర వేడుకలు కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని ఆయన కోరారు. పోలీస్ శాఖకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన విద్యార్థి చేశారు.

సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులను ఖండించిన సురేంద్ర

విశాలాంధ్ర-అరకులోయ : అనకాపల్లి జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు అప్పల రాజు పై అక్రమ పీడీ యాక్ట్ పెట్టి జైలుకు పంపించే క్రమంలో సిపిఎం నక్కపల్లి బంద్ కు పిలుపునిచ్చిందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర తెలిపారు. పేద ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగిన సిపిఎం ముందు ఉంటుందని అదేవిధంగా సిపిఎం నాయకులు అప్పలరాజు పై దాడికి నిరసిస్తూ బంద్ కు పిలుపునిచ్చారని ఆయన తెలియజేశారు. అయితే ప్రశాంతంగా బందులో పాల్గొని తమ నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సురేంద్ర ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. అక్రమంగా అరెస్టు చేసిన సిపిఎం నాయకులను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా అకారణంగా అనకాపల్లి జిల్లా సిపిఎం నాయకుడు అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్ కేసును కూడా రద్దుచేసి బేసరత్తుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో సిపిఎం నాయకులపై పిడి యాక్టులు పెట్టి వారిని జైలులో మగ్గేలా చేసి ఉద్యమాలను అణిచివేయాలని చూస్తుందని ఆయన వాపోయారు. ప్రభుత్వం కుటీల ప్రయత్నాలను ప్రజలు తిప్పి కొట్టక తప్పదని అవకాశం వచ్చిన వెంటనే తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. ఎప్పటికైనా ప్రభుత్వ పాలకులు స్పందించి సిపిఎం పార్టీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులిపుట్టి, బి.గోనుగూడ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంకుధ్ర-కురుపాం : మండలంలోని తిత్తిరి పంచాయతీ పులిపుట్టి-గోనుగూడ రహదారి నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కెవికోండయ్య, మాజీ ఎంపీటీసీ, బిడ్డిక కడాయి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశాల మేరక పులిపుట్టి-గోనుగూడ గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రోడ్డు సదుపాయాల ద్వారా ప్రజలకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. నాణ్యమైన రహదారి నిర్మాణంతో రవాణా సమస్యలు తొలగిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, స్థానిక నాయకుల, శంకర్, సుబ్బలక్ష్మి, స్థానిక సర్పంచ్ థాత్రాజ్, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్లను ఆవిష్కరించిన జిల్లా ప్రముఖులు

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజలపక్షాన నిలిచే విశాలాంధ్ర దినపత్రిక అధికారులతో పాటు, అన్ని పార్టీల, అన్నివర్గాల వార్తలను సకాలంలో ప్రచురణ చేస్తూ అందరి మన్ననలను పొందుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు డాక్టర్ ఆర్ వైశాలి, స్వప్నిల్ జగన్నాథ్ లు తెలిపారు. సోమవారం వారంతా విశాలాంధ్ర దినపత్రిక 2025 క్యాలెండర్లను ఆవిష్కరించారు. 75 ఏళ్ల పాటు చరిత్ర కలిగిన విశాలాంధ్ర పేద బడుగు బలహీన వర్గాల పక్షాన వార్తలను రాస్తూ సమాజాన్ని చైతన్య పరచడంలో ముందంజలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి హెచ్ఎస్ డాక్టర్ నాగభూషణ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.బలమాన్ సింగ్ విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్ మంతిని రమేష్, విశాలాంధ్ర పార్వతీపురం రిపోర్టర్లు వానపల్లి శంకరరావు, అనంతరావు, రవీంద్ర పండాలు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి భక్తులకు సులభతర దర్శనం కల్పించాలి

జిల్లా అధికారులకు రాష్ట్ర మంత్రి ఆదేశాలు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: వైకుంఠ ఏకాదశి వంటి అత్యంత పవిత్రమైన పర్వదినాన్ని పురస్కరించుకొని వైష్ణవ దేవాలయాలకు లక్షలాది భక్తులు తరలివచ్చే అవకాశమున్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా అధికారులను ఆదేశించారు. భక్తులు ఉత్తర ద్వార దర్శనాన్ని సాఫీగా, సులభంగా చేసుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా క్యూలైన్ల పకడ్బందీ నిర్వహణ, తాగునీటి సౌకర్యాలు, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎక్కడా తోపులాటలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, భక్తుల ప్రాణ భద్రతే అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. పోలీస్, రెవెన్యూ శాఖలతో పాటు దేవాదాయ శాఖ, మున్సిపల్ అధికారులు సహా అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ప్రశాంతమైన, భక్తి భావంతో కూడిన దర్శన అనుభూతి కల్పించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

563 చెరువులలో 14.26 లక్షల చేప పిల్లలు సరఫరాకు ఆమోదం

జిల్లా మత్స్య శాఖాధికారి సంతోష్‌కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం : పాలకొండ ఐటీడిఏ పరిధిలోని పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాల్లో గల 563 చెరువులలో 14.26 లక్షల చేప పిల్లలను సరఫరాకు జిల్లా కలెక్టర్ ఆమోదం లభించినట్లు జిల్లా మత్స్య శాఖాధికారి టి.సంతోష్ కుమార్ తెలిపారు. జిల్లాలో సీతంపేట ఐటీడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్థిక సహకారంతో ఈ చెరువులలో చేప పిల్లలు సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. పాలకొండ, సీతంపేట, భామిని, వీరఘట్టం మండలాలలో 563 చెరువులలో 14.26 లక్షల చేప పిల్లలను ఎల్ వన్ టెండరు ద్వారా సరఫరా చేయుటకు జిల్లా కలెక్టర్ ఆమోదాన్ని పొందినట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సం.రంలో టెండరు ఆలస్యం కావడం వలన చేప పిల్లలు పంపిణీ ఆలస్యం అయిందని, అలాగే వర్షాలు ఎక్కువగా పడటం వలన చెరువులలో సరిపడా నీరు ఉందన్నారు. కావున చేప పిల్లలను పంపిణీ చేయడం జరుగుతుందని,సరిపడా నీరు లేనిచో చెరువులలో చేప పిల్లలు వేయడం జరిగినదని స్పష్టం చేశారు.

భూ సమస్యను పరిష్కరించి అర్హులకు పట్టాలు ఇవ్వండి

సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు

విశాలాంధ్ర-సీతంపేట : మండలం, కడగండి పంచాయతీ లోకొత్తవలస గ్రామంలో నెలకొన్న భూమి సమస్యను పరిష్కరించాలి అని అర్హులైనవారికి పట్టాలిచ్చి ఆన్లైన్ చేయాలని సోమవారం ఏపీవో చినబాబుకు వినతి పత్రాలు ఇచ్చిన సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి. మన్మధరావు 2005లో హైకోర్టు తీర్పు ద్వారా సాధించుకున్న 9.18 సెంట్లు భూమిలో ఇంకా 4.70 సెంట్లు సారిపల్లి వెంకటరమణ పేరు మీదనే ఉన్నదని దాన్ని రెవెన్యూ ఆన్లైన్లో క్యాన్సిల్ చేసి అర్హులకు పట్టాలు ఇచ్చిన రైతుల పేరు మీదగా మార్చాలని సిపిఐ పార్టీ నాయకులు తెలిపారు.

పరిశుభ్రతోనే ఆరోగ్య రక్ష

విశాలాంధ్ర-సీతంపేట : గ్రామంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు అనేవి సీతంపేటలో కూడా చేయడం జరుగుతున్నది అన్నారు. దీనిలో భాగంగా సీతంపేటలో గల వీధులలో గల కాలువలలో పూడికి చేయించి శుభ్రం చేయించడం జరుగుతుంది. సదరు కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఆరిక కళావతి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్ శ్రీనివాసరావు, హాజరై తగు సూచనలు చేయడం జరిగింది, సదరు కార్యక్రమంలో బి.రామకృష్ణ పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ పాల్గొనడం జరిగింది.

చెరువుల్లో అనధికార రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలి

అడుగంటుతున్న భూగర్భ జలాలను రక్షించండి సబ్ కలెక్టర్‌కు కాంగ్రెస్ వినతి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జిల్లాలో ఆక్రమణకు గురైన చెరువుల చెరను విడిపించాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, నియోజకవర్గ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు కోలా కిరణ్‌కుమార్, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ, మేడిశెట్టి రామచంద్రరావు తదితరులు కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్‌లో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీలోని బిళ్ళబంధ, దేవుడి బంధ, నెల్లిచెరువు, లక్ష్మినాయుడు చెరువు, కోదువాని బంధ, లంకెల చెరువు, వరహాల గెడ్డ, సంఘం నాయుడు చెరువు, రాయబంధ, తమ్మినాయుడు చెరువు, బోటు వారి చెరువు, పాత్రుడు కోనేరు, కొత్తచెరువు, గంగసాగరం తదితర చెరువులు ఆక్రమణకు గురయ్యాయన్నారు. నెల్లిచెరువు, దేవుడి బంధ, లక్ష్మీనాయుడు చెరువు తదితర వాటిలో పక్క భవనాలు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే కొన్ని భవనాలు పూర్తయ్యాయన్నారు. అలాగే పక్కనున్న సర్వే నెంబర్లుతో కామయ్య బంధ, దేవుడి బంధ తదితర వాటి స్థలాలను అక్రమ రిజిస్ట్రేషన్‌లో జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే సాలూరు మున్సిపాలిటీ లోని పంద వీధి సమీపంలోని రాణమ్మ కోనేరు, నెయ్యిల వీధిలోని అగ్రహారం కోనేరు, దండిగా బోర్డులోని పేరసాగరం ఆక్రమణలకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తక్షణమే పాత రికార్డులు ప్రకారం పార్వతీపురం సాలూరు మున్సిపాలిటీలోని చెరువులను సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి ఆక్రమణలు తొలగించాలన్నారు. కోట్లాది రూపాయల విలువైన స్థలాలు అక్రమార్కుల చేతికి వెళున్నాయన్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రమైనప్పటి నుంచి చెరువుల్లో కబ్జాలు పెరిగాయన్నారు. వీటివలన భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. తక్షణమే చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని కోరారు.

జిల్లా కలెక్టర్‌కు రెవెన్యూ అసోసియేషన్ ప్రశంసలు

విశాలాంధ్ర-బెలగాం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రెవెన్యూ క్లినిక్-స్పెషల్ డెస్క్' కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లాలో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామమూర్తి జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి పనితీరును, జిల్లా అధికారుల సమన్వయాన్ని కొనియాడారు. ఒకప్పుడు మన్యం జిల్లా ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నుంచి, నేడు రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరు ప్రఖ్యాతులు పొందేలా కలెక్టర్ డా.ఎన్ ప్రభాకరరెడ్డి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. సాధారణంగా జటిలంగా ఉండే రెవెన్యూ సమస్యలను పరిష్కరించి, ప్రజల్లో సంతృప్తి స్థాయిని పెంచడానికి ప్రతి రెవెన్యూ ఉద్యోగి చిత్తశుద్ధితో పని చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కలెక్టర్ నాయకత్వంలో జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లు, డీఆర్ఓ మరియు తహసీల్దార్లు ఒక బృందంగా పనిచేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అభినందించారు. జిల్లాలో వినూత్నంగా చేపట్టిన 'గోపాల' కార్యక్రమం మరియు సంప్రదాయ 'కందికోత' వేడుకల్లో కలెక్టర్ స్వయంగా కుటుంబ సమేతంగా పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ కలెక్టర్ చేయని విధంగా స్థానిక సంప్రదాయాలను గౌరవిస్తూ, ప్రజలతో మమేకమవ్వడం తమ అదృష్టమని ప్రతినిధులు తెలిపారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని, జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్లాలని రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ తరపున కలెక్టర్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

పశుసంవర్ధక రంగంతోనే గ్రామీణ ఆర్థిక పురోగతి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : పశుసంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను స్థిరపరచవచ్చని జిల్లా కలెక్టర్ డా ఎన్ ప్రభాకర రెడ్డి అభిప్రాయపడ్డారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సంబంధిత ఇతర శాఖలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని అధికారులకు, సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. రైతులకు సమాచారాన్ని వేగంగా చేరవేయడానికి జెమినీ ఏ వన్ పెర్‌ప్లెక్సిటీ ఏ వన్ వంటి ఆధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను వినియోగించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పశు పాలనలోని ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని, గ్రామీణ యువతకు స్వయం ఉపాధి దిశగా శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రతి రైతు ఏడాదికి 1200 గుడ్ల ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలన్నారు. వ్యవసాయ వ్యర్థాలను సంపదగా మార్చే ప్రాజెక్టులు, పశువుల ఎరువు ఆధారిత వ్యాపారాలను ప్రోత్సహించాలన్నారు. ఎగుమతి నాణ్యత కలిగిన మేత ఉత్పత్తిని పెంచి రైతులకు లాభాలు చేకూర్చాలన్నారు. మహిళా డైరీ సహకార సంఘాలను బలోపేతం చేస్తూ, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలనే లక్ష్యంగా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు.జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ శివ్వాల మన్మధరావు, గ్రామ ముస్తాబు, కుటుంబ ముస్తాబు, గోబాల సంబరాలు మొట్టమొదటగా మన జిల్లాలో చేపట్టి రాష్ట్రమంతటా విస్తరించి పార్వతీపురం రాష్ట్రంలో ఒక గుర్తింపు పొందే జిల్లాగా మారడం గొప్ప విషయమన్నారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ శివ్వాల మన్మథ రావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె. ఎస్.ఎన్.రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి అన్నపూర్ణ ఇతర శాఖల అధికారులు, పశు వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొండెం ఖల్‌కు రక్షిత తాగునీటి పథకం మంజూరు చేయండి

ట్రైబల్ రైట్స్ ఫోరం

విశాలాంధ్ర-కురుపాం: మండలంలో మొండెంఖల్ గ్రామనికి 60 వేల లీటర్ల త్రాగునీటి ట్యాంకు మంజూరు చేయాలని సోమవారం గ్రీవెన్స్ లో డిఆర్వోకు టిఆర్ఎఫ్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు లోవరాజు, ఐ.రామకృష ఐనపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటురని గ్రామంలో సుమారు 2,500 మంది జనాభా నివాసం ఉండగా ఇంటింటికీ తాగునీటి సరఫరా అంతరాయంగా కొనసాగుతోందని ఒకప్పుడు జల జీవన్ మిషన్ ద్వారా మంజూరైన ట్యాంకు రద్దయిన నేపథ్యంలో 60 వేల లీటర్ల సామర్థ్యం గల కొత్త తాగునీటి ట్యాంకును మంజూరు చేస్తే ప్రజలకు త్రాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో వైకుంఠ ద్వారా దర్శనం చేసుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కురుపాం : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర విప్ జగదీశ్వరి తిరుమల తిరుపతిలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో, సంతోషంగా జీవించాలని వెంకటేశ్వర స్వామిని ప్రార్థించారు. దర్శనానంతరం ఆలయంలో వెంగమాంబ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైకుంఠ ద్వార ఉత్తర ద్వార దర్శనాన్ని కూడా చేసుకోనున్నట్లు తెలిపారు.

అర్జీల పరిష్కారంతో ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ హితవు

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంతో ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరగాలని, ఆ దిశగా వినూత్న రీతిలో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులకు హితవు పలికారు. ఒకే సమస్యపై ఫిర్యాదులు పలుమార్లు పునరావృతం కాకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే వినతులకు నాణ్యమైన రీతిలో పరిష్కారం చూపాలని, ప్రత్యేక శ్రద్ధ వహించి పక్కా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులతో సంబంధిత అధికారి తప్పనిసరిగా ఫోన్ ద్వారా సంప్రదించాలని, రీ ఓపెన్ అవుతున్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, తగిన విధంగా ఎండార్స్మెంట్ వేసి ఇవ్వాలని చెప్పారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జేసీ సి. యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారులు వివిధ సమస్యలపై 144 వినతులు అందజేశారు. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 55 ఉండగా, 89 అర్జీలు ఇతర అంశాలకు చెందినవిగా ఉన్నాయి. దీనిలో భాగంగా కలెక్టర్ గత వారం జరిగిన పీజీఆర్ఎస్ పై సమీక్షించి. క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలని సూచించారు. గత నెల, ఈ నెల పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఇందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్డిఏ పీడీ ఎం. సుధారాణి భాగస్వామ్యం కాగా వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సమస్యలను స్పష్టంగా తెలుసుకోవాలి

ఎన్.సి.డి పిఓ డాక్టర్ జగన్‌మోహన్

విశాలాంధ్ర-బెలగాం/గరుగుబిల్లి : ఆరోగ్య సమస్యలను స్పష్టంగా తెలుసుకొని నమోదు చేయాలని జిల్లా ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. సీతారాంపురం గ్రామంలో సంచార చికిత్సా వైద్య శిబిరాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత మందికి ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు, వారి సమస్యలు, చికిత్సా వివరాలు రికార్డులో పరిశీలించారు. ప్రతీ ఆరోగ్య సమస్యను నమోదు చేయాలని, ప్రజల సంతృప్తి స్థాయి పెంచే లక్ష్యంగా వైద్యసేవలు అందించాలన్నారు. దీర్ఘకాలిక రోగులతో మాట్లాడి ఆరోగ్య స్థితి,మందులు వేసుకుంటున్న ప్రక్రియపై తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ఎప్పటికపుడు గృహ సందర్శన చేసి మోతాదు ప్రకారం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మందులు వేసుకుంటున్నారా అని పర్యవేక్షించాలన్నారు. అలాగే జీవన శైలి,ఆహార నియమావళిపై అవగాహన కల్పించాలన్నారు. అసంక్రమిత వ్యాధులను గుర్తించే లక్ష్యంగా చేపట్టిన ఎన్.సి డి సర్వే,ఆన్లైన్ నమోదు తీరు తనిఖీ చేశారు.ప్రతీ వారం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ లక్షణాలు గుర్తించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్కూల్, అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హెల్త్ స్క్రీనింగ్ పూర్తిచేసి 4డి లు గుర్తించాలన్నారు. అనంతరం 104 వాహనంలో వైద్య పరికరాలు, మందులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటలక్ష్మి, సుబ్బలక్ష్మి, 104 సిబ్బంది,ఆశ లు ఉన్నారు.

గిరిజన విద్యార్థుల కోసం అదనపు మరుగుదొడ్లు నిర్మాణం

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: మండలంలోని డోకి సీల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పన వేగవంతం చేస్తున్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఐటీడీఏ పీవో ఈ పాఠశాలను సందర్శించి ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా ప్రహరీ గోడ కూలిపోవడంతో దాన్ని నిర్మాణానికి అంచనా వ్యయంతో నిధులు కేటాయించగా, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం మరుగుదొడ్లు అరకొరక ఉండడంతో దాన్ని పరిష్కరించేందుకు స్వఛభారత్ ద్వారా 20 మరుగుదొడ్లను నూతనంగా మంజూరు చేశారు. ఈ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. విద్యార్థుల అవసరాలు బట్టి ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు కొంతమేర నిరుపయోగంగా ఉండడంతో విద్యార్థులు బహిర్భూమి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఐటీడీఏ అధికారులు స్వచ్ఛభారత్ ద్వారా 20 మరుగుదొడ్ల నిర్మాణానికి ఆమోదం తెలపడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల్లో భాగంగా రన్నింగ్ వాటర్, తలుపులు, సిటింగు వంటి పనులు చేస్తున్నారు.

కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపిన హిట్ అండ్ రన్ కేసుల బాధిత కుటుంబాలు

పరిహారం చెల్లింపులతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రోడ్డు ప్రమాదాల్లో గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోయిన (హిట్ అండ్ రన్) బాధితుల కుటుంబాలకు ఆర్థిక పరిహారం అందడంతో జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బాధిత కుటుంబాలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రోడ్డున పడ్డ తమ కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం కొంత ఊరటనిస్తుందన్న లబ్ధిదారులు,కేవలం కలెక్టర్ చొరవతో పరిష్కారం అయిందని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని అన్నారు. బాధిత కుటుంబాలు రోడ్డున పడకూడదనే మానవతా దృక్పథంతో కేంద్ర ప్రభుత్వం స్థాయిలో ఈపథకం అమలవుతుంది. సంపాదించే వ్యక్తిని కోల్పోయి రోడ్డున పడ్డ బాధిత కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం కొంత ఊరటనిస్తుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. హిట్ అండ్ రన్ కేసులకు సంబంధించి 10 మందికి గాను 9 మందికి మంజూరైన పరిహారాన్ని వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వమే నేరుగా జమచేసినట్లు చెప్పారు. మిగిలిన ఒక్కరికి ఇన్సూరెన్స్ రావలసి ఉందని అన్నారు. హిట్ అండ్ రన్ మోటార్ వెహికల్ యాక్సిడెంట్స్ - 2022 చట్టం మేరకు మరణించిన బాధిత కుటుంబానికి రూ. 2 లక్షలు, తీవ్రమైన గాయానికి రూ. 50,000/-లుగా సవరించడం జరిగిందని, ఆ విధంగా నేడు ఒక్కొక్కరికి రూ. 2లక్షలు చొప్పున నలుగురికి వెరసి రూ. 8లక్షలు, తీవ్ర గాయలైన వారికి ఒక్కొక్కరికి రూ. 50వేలు చొప్పున ఆరుగురికి పరిహారం చెల్లిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రమాదం జరిగిన తర్వాత వాహనం ఆచూకీ లభించని పక్షంలో, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల ప్రకారం బాధిత కుటుంబాలకు తక్షణ సాయం కింద ఈ పరిహారం మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎటువంటి మధ్యవర్తులు లేకుండా, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే ఈ నిధులు జమ అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన విచారించి, అర్హులైన వారందరికీ పరిహారం అందేలా చూడాలని సంబంధిత రెవెన్యూ మరియు పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ డా. పి.ధర్మచంద్రారెడ్డి, రవాణా శాఖ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు ఏకాగ్రతే ఆయువుపట్టు

విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అరిందం కుమార్

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని పెదమెరంగి కూడలి లో గల తిరుమల సాయి ఉన్నత పాఠశాలను సోమవారం పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి ఆధ్వర్యంలో హైదరాబాదు నుండి విచ్చేసిన విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అరిందం కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులు విద్యాభివృద్ధిలో అనుసరించాల్సిన సాధనలో పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడంలో మెలకువలు గురించి విద్యార్థులకు కూలంకసంగా వివరించారు. అనంతరం విద్యార్థుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మీ శక్తిని మీ సమయాన్ని మీ ఆరోగ్యాన్ని మీ లక్ష్యాన్ని మీ కుటుంబాన్ని గురించి తెలుసుకొని ఏకాగ్రతతో చదివితే మీరుఅనుకున్న లక్ష్యాలు చేరుకోగలరని విద్యార్థుల చైతన్యపరిచారు. అయితే ఇప్పటివరకు ఆయన ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో 1020 విద్యాలయాలు సందర్శించి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించి సామాజిక సేవ చేస్తున్నారు కాగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విశ్రాంత కుమార్ నవోదయ విద్యాలయ శ్రీకాకుళం తెలుగు ఉపాధ్యాయులు జిల్లెల్ల మూ డీ అమ్మ సేవా సమితి పార్వతిపురం వ్యవస్థాపక కార్యదర్శి జి చిన్నం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఏం సాధించాలన్న ముఖ్యంగా మనసులో భయాన్ని విడనాడి ఏకాగ్రతతో చదువుకుంటే అప్పుడే అనుకున్నది సాధిస్తారని, అంతేకాకుండా పరీక్షల్లో ఉత్తీరు?లు కావడం పెద్ద విషయం కాదని విద్యార్థులకు తెలియ చెప్పారు. అనంతరం పాఠశాలకు విచ్చేసిన అతిథులను పాఠశాల కరస్పాండెంట్ సరళ కుమారి సతివాడ శంకరరావు ఘనంగా సత్కరించారు

శక్తి టీం అవగాహన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవ్ రెడ్డి ఉత్తర్వుల ప్రకారం ఎఎస్పీ, శక్తి టీమ్స్ నోడల్ ఆఫీసర్ మనీషా వంగలరెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం శక్తి టీమ్ 1 & 2 పోలీస్ అధికారులు, సిబ్బంది సోమవారం పార్వతీపురం పట్టణం బెలగాం చర్చివీధిలోని డివిఎం హైస్కూల్ లోని విద్యార్థులకు సమాజపు పాత్ర, బాధ్యతపై సామాజిక విలువలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరస్పర గౌరవం, లింగ సమానత్వం ప్రాముఖ్యతను వివరించారు. సురక్షితమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్రను తెలియజేశారు. క్రమశిక్షణ, మంచి ప్రవర్తన ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని విద్యార్థినులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ ఇంచార్జి, ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, మహిళా కానిస్టేబుళ్లు రామలక్ష్మి, నిర్మల, పద్మ, శక్తి టీమ్ 1& 2 పాల్గొన్నారు.

పెద్దమరికిలో గ్రామసభ

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: మండలంలోని పలు పంచాయతీలను విభజించి కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయాలని ఆయా పంచాయితీల ప్రజల వినతి మేరకు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని పెద్దమరికి పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో సత్యం, డిప్యూటీ ఎంపీడీవో పాపారావు ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఆ పంచాయతీ పరిధిలో గల గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించి గ్రామసభ నిర్వహించారు. ఇప్పటివరకు పెదమరికి పంచాయతీ పరిధిలో ఐదు గ్రామాలు ఉండగా అందులో రెండు గ్రామాలను విభజించి కొత్త పంచాయతీ ఇవ్వాలని ఇటీవల పంచాయతీ ప్రజలు అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు దీంతోపాటు మండలంలోని అడ్డాపు శీలా, డోకి శీల, ములగ, పంచాయతీ ప్రజలు కూడా ఆయా పంచాయతీలను విభజించి కొత్త పంచాయతీ ఏర్పాటు చేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు వీరందరిలో కూడా గ్రామసభ నిర్వహించి ప్రజల యొక్క సూచనలను పరిగణలోకి తీసుకుంటున్నారు పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఇప్పటికే డోక్ శీల గ్రామంలో జరిగిన గ్రామసభ రసాభాసగా మారిన సంగతి తెలిసిందే. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఈ విధంగా ఉంటే పైస్థాయిలో మాత్రం ఉన్నతాధికారులు పంచాయతీల విభజనకు ఇటువంటి పచ్చజెండా ఊపిన దాఖలాలు కనిపించడం లేదు.

నేడు ఏకాదశికి అన్నిఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-సీతానగరం : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో నేడు జరగనున్న ఏకాదశి పండుగకు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, టీటీడీ పారాయణకర్త శ్రీనివాసరావులు తెలిపారు. ఉదయం 6 గంటల నుండి ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని తెలిపారు. సీతానగరం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు లచ్చయ్యపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ధనుర్మాస ఏకాదశి ఉత్సవాలు ఘనంగా చేయడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు పాల్గొని స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని అర్చకులు విజ్ఞప్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-సీతంపేట : మండలంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎంపిక చేసిన అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజూరు తేజోవతికి పాలకొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పడాల భూదేవి మర్యాద పూర్వకంగా ఆహ్వానించి శాలువతో సత్కారం చేశారు. అనంతరం పాలకొండ నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి పడాల భూదేవి మాట్లాడుతూ ఇంతవరకు మన అరకు పార్లమెంట్ స్థానంలో ఎంపిక అయిన ఎంపీ (వైసీపీ) మండలంలో ఎక్కడ పర్యటించడం లేదని మన గిరిజనులు పట్టించు కోలేదని అందుకే మనకు ఎంపీ నిధులు రాలేదు.కనుక మన గిరిజన ప్రాంతం వెనుక బడిపోయిందని వాపోయారు. ఇప్పుడు మన అందరం కలిసి కృషి చేసి మన తెలుగు దేశ ఎంపీ ని గెలిపించు కొని మన గిరిజనుల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. మన అందరం కలిసి ఎటు వంటి తారతమ్యాలు లేకుండా మన మండలంలో ఉన్న అన్నీ పంచాయితీలు తెలుగుదేశం పార్టీ కైవశం చేసుకునేలా కృషి చేయాలని కోరారు. అనంతరం అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజూరు తేజోవతి మాట్లాడుతూ ఇంతవరకు కూటమి ఆదేశాలమేరకు కలసి పనిచేశాం, ఇప్పుడు మన తెలుగుదేశం ప్రభుత్వం ఆదేశాలమేరకు మన పార్టీ బలోపేతం చేయడానికి నావంతుగా కృషి చేస్తానని ఆమె తెలిపారు. ప్రభుత్వం గుర్తించి నాకు ఈ పదవిని ఇచ్చి మరింత బాధ్యత అప్పగించారని ఆ బాధ్యతను సంపూర్ణంగా

స్వీకరించి ఆ బాధ్యత నెరవేరుస్తానని ఆమె తెలిపారు .అనంతరం నూతనంగా ఎంపికైన అరకు పార్లమెంట్ కార్యదర్శి బిడ్డిక జయలక్ష్మి కి పాలకొండ నియోజకవర్గ తెలుగు దేశ పార్టీ ఇంచార్జీ పడాల భూదేవి ,అరకు పార్లమెంట్ అధ్యక్షురాలు మోజూరు తేజోవతి, మరియూ తెలుగు దేశ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు శాలువ తో సన్మానం చేశారు.ఆమె మాట్లాడుతూ పార్టీ నన్ను గుర్తించి ఈ బాధ్యత అప్పగించి నందుకు ప్రభుత్వంకు నేను రుణపడి ఉండి కష్టపడి పార్టీ కోసం పని చేస్తానని తెలిపారు. నాకు ఈ పదవి ఇచ్చి నందుకు మా నియోజకవర్గ ఇన్చార్జి పడాల భూదేవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతంపేట మండల అధ్యక్షుడు తోట.ముఖలింగం, సవర మాలయ్య టిపిసి కమిటీ సలహాదారులు, మూర మోహన్‌రావు ఏఎంసి డైరెక్టర్,సవర మంగయ్య డైరెక్టర్,ఈ మాజీ జడ్పిటిసి పాలక రాజుబాబు, కూర్మారావు, మాజీ ఎంపీపీ. సవర కుంపి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గిరి శిఖర పంచాయితీలలో ఘనంగా కందికొత్తల పండుగ

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండల పరిధిలో గల గిరి శిఖర పంచాయితీలైన టీ కే జమ్ము పిటిమండ కొండ చిలకాం ఆదివాసీల ఆచార సాంప్రదాయాలకు ఆనవాలం ఈ కందికొత్తల పండుగ. గిరిజనులు సాంప్రదాయబద్ధంగా జరుపుకునే ముఖ్యమైన పండుగే ఈ కందికొత్తల పండుగ. గిరిజనులు కొత్తగా పండించిన కందులు జొన్నలు రాగులు మొదలైన పంటలను మొదటిసారి తినడానికి ముందు ఆ గ్రామాల గ్రామ దేవతలకు అర్పించి మొక్కులను తీర్చి పండుగలను జరుపుకుంటారు. అయితే గిరిజనులు జరుపుకునే ముఖ్యమైన పండుగ ఈ కందికొత్తల పండుగ. ఈ పండగ ప్రతి సంవత్సరం డిసెంబర్ చివరి వారంలో అత్యంత సాంప్రదాయ బద్ధంగా తమ పంటలను సంస్క ృతిని గౌరవించుకుంటూ ఘనంగా జరుపుకుంటారు. ఈ పండుగలలో దీశరోడు జన్నోడు యజ్జోడు కీలక పాత్ర పోషిస్తారు. ఈ కందికొత్తల పండుగను ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. డప్పుల సందడితో రాత్రులు సందడి చేస్తుంటారు తొలిరోజు అడవిదేవతలైన చిత్తరమ్మ గొడ్డలమ్మ కంపరమ్మ లను తీసుకువచ్చి జాకరమ్మ వద్దకు చేరుస్తారు. అనంతరం గడపగడప వద్దకు తీసుకువెళ్లి దర్శించుకుంటారు. కోళ్లు చీరలు బంగారు వెండి లతో మొక్కులు చెల్లిస్తారు. దేవతలను సమీప గ్రామాలకు తీసుకువెళ్లి డప్పల వాయిద్యాల మధ్య బియ్యం సేకరిస్తారు. ఆ సేకరించిన వాటితో అనుపోత్సవం రోజున గ్రామాలలో గ్రామస్తులంతా కలిసి ఒక చోట భోజనాలు చేస్తారు.అనంతరం గొడ్డలమ్మ జాతరమ్మ తంపరమ్మ లను అటవీ ప్రాంతంలోని ఆయా స్థానాలలో భద్రపరుస్తారు. యువతి యువకులు మహిళలు వేష ధారణలు ధరించి స ృత్యాలతో సంస్క ృతి సాంప్రదాయాలతో అత్యంత వైభవంగా జరుపుకుంటారు.

పలువురు ఎస్ఐలకు బదిలీ

పార్వతీపురం పట్టణఎస్సైగా ప్రయోగమూర్తి, రూరల్ ఎస్సైగా రాజేష్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో పలువురు ఎస్ఐలకు బదిలీచేస్తూ జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. సీతానగరం ఎస్సైగా జిల్లా ప్రాక్టికల్ ట్రైనింగ్ కేంద్రంలో పనిచేస్తున్న ఎం. హేమలతను నియమించగా, ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న ఎం.రాజేష్ ను పార్వతీపురం రూరల్ కు బదిలీ చేశారు. జిల్లా ప్రాక్టికల్ ట్రైనింగ్ కేంద్రంలో పనిచేస్తున్న లాలం అర్జున్ కు పాచిపెంట ఎస్సైగా నియమించారు. పార్వతీపురం రూరల్ పిఎస్, డీఎస్పీబిలో ఎస్సీ గా పనిచేస్తున్న పి దినకర్ను పార్వతీపురం డిఎస్పీబికి బదిలీ చేశారు. పార్వతీపురం జిల్లా పోలీస్ కేంద్రంలో వి ఆర్ లో ఉంటున్న ఎం జగదీష్ నాయుడు కొమరాడ పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయగా, అక్కడ ఎస్సైగా పనిచేస్తున్న కే నీలకంఠమును పార్వతీపురం జిల్లా కేంద్రం వి ఆర్ కు బదిలీ చేశారు. పాలకొండ ఎస్సైగా ఉన్న కే ప్రయోగమూర్తిని పార్వతీపురం టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా నియమించారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో విఆర్‌ఓ ఉన్న డి వెంకన్నను పాలకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నియమించారు. పార్వతీపురం వి ఆర్ లో ఉన్న ఎస్ షణ్ముఖరావును వీరఘట్టం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నియమించారు. ఎర్రగట్టం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఉన్న జి కళాధర్ ను పార్వతీపురం జిల్లా కేంద్రంలో వి ఆర్ కు బదిలీ చేశారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాదులు దూరం

విశాలాంధ్ర-బెలగాం : పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరి చేరకుండా ఉంటాయని జిల్లా ఎన్.సి.డి అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. సీతానగరం మండలం బూర్జ గ్రామంలో సర్పంచ్ గుజ్జల దాసు ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య నిర్వహణ ప్రక్రియ చేపట్టారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తా, చెదారం, వ్యర్థాలు, తుప్పలు యంత్రాలతో తొలగించడం జరిగింది.

జెసిబి, ట్రాక్టర్ సాయంతో గ్రామంలో పలు ప్రదేశాల్లో పారిశుధ్యం నిర్వహించి వ్యర్థాలను డంపింగ్ వద్ద పారబోసారు. చెత్తా, చెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య రీత్యా డాక్టర్ టి. జగన్మోహన్ రావు పలు సూచనలు చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని వ్యక్తిగత శుభ్రతతో పాటుగా మనం నివసించే పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉన్నప్పుడే రోగకారక జనితాలకు ఆస్కారం ఉండదని, వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని పేర్కొన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తో క్యాన్సర్ ముప్పు వాటిల్లే అవకాశం ఎక్కువని కావున వాటి వినియోగం తగ్గించాలని, బహిరంగ ప్రదేశాల్లో పారవేయరాదన్నారు. వ్యాదుల వ్యాప్తికి కారణ భూతమైన బహిరంగ మల విసర్జన నిర్మూలించడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములై సమష్టిగా కృషి చేయాలన్నారు. కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి ప్రవేశపెట్టి విస్తృతంగా అమలుచేస్తున్న ముస్తాబు కార్యక్రమం ఆరోగ్య రీత్యా ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యం ముడిపడి ఉందనీ ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ఆచరించాలని కోరారు.